
డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అప్పటి జనాభాకు అనుగుణంగా నిర్మించిన డ్రైనేజీ పైప్‌లైన్లు నేడు పెరిగిన జనాభాకు సరిపోవడం లేదని, ఆ పైప్‌లైన్లను తొలగించి వాటి స్థానంలో పెద్దపైప్‌లైన్లను నిర్మిస్తున్నామన్నారు. శనివారం డివిజన్‌లోని లింగంపల్లి శ్రీగణేష్ దేవాలయం వద్ద రూ.16 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ భావన, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సుభాష్‌పటేల్, భీమ్‌రాజ్, క్షీరసాగర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, సీనియర్ నాయకులు డాక్టర్ బద్దుల ఓంప్రకాష్ యాదవ్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జీ, సునీల్ బిడ్లాన్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కవాడిగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కాన్ఫడరేషన్ ఆఫ్ ఆర్గనైజ్‌డ్ దళిత్ ఎంటర్‌ప్రెన్యూస్ (కోడ్) వ్యాపార వేత్తలు, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కడారం వినయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కె శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం వారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కవులు, కళాకారులు, సినిమా ఆర్టిస్టులకు ప్రభుత్వం ఇచ్చే నంది అవార్డులను, వచ్చే సంవత్సరం నుంచి ప్రజాగాయకుడు గద్దర్ అవార్డ్ పేరుతో ఇస్తామని సీఎం ప్రకటించడం హర్షణీయమని వారన్నారు. ప్రత్యేక రాష్ట్రం, బడుగు బలహీన వర్గాల సమస్యలపై పోరాటాలు చేసిన గద్దర్ కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఆయన పేరతో అవార్డులు ఇస్తామనడం గర్వకారణమని అన్నారు.


డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రావణ్‌కుమార్ తదితరులు

ఎంఎస్ఎంఈడీ చట్టాన్ని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలి


మాట్లాడుతున్న భారతీయ దళిత పరిశ్రమల సమాఖ్య జాతీయ కౌన్సిల్ చైర్మన్ రాజశేఖర్

కవాడిగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మైక్రోస్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ (ఎంఎస్ఎంఈడీ) చట్టాన్ని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని భారతీయ దళిత పరిశ్రమల సమాఖ్య జాతీయ కౌన్సిల్ చైర్మన్ ఎర్రతోట రాజశేఖర్ డిమాండ్ చేశారు. దళిత ఆదివాసీ పారిశ్రామికుల ప్రోత్సాహం కోసం వారికి రాయితీలు, సడలింపులు ఇస్తూ 2006లో కేంద్రంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. క్షేత్ర స్థాయిలో ఆ చట్టం అన్ని రాష్ట్రాల్లో అమలుకానందువల్ల నీరుగారిపోయిందని ఆయన వాపోయారు. శనివారం దోమలగూడలోని కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర చాప్టర్ అధ్యక్షుడు నీరుడు రాజు, తెలంగాణ చీఫ్ మెంటల్ అబ్దుల్ లక్ష్మణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత పారిశ్రామిక వేత్తలకు రావాల్సిన రాయితీలు ఇవ్వకుండా ఇతర డిపార్ట్‌మెంటులకు మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో 2014-23 మధ్య దళిత పారిశ్రామిక వేత్తలకు నష్టాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ లెక్కల ప్రకారం 2015-24 మధ్యకాలంలో రూ.3,19,187 కోట్ల విలువైన కొనుగోలు జరగ్గా ఎంఎస్ఎంఈడీ చట్టం 2006 నిబంధనల ప్రకారం ఎస్సీ ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు కేవలం 412 కోట్లు మాత్రమే దక్కినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ చేవేళ్లలో ప్రకటించిన ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్‌కు కట్టుబడి తెలంగాణలో ఎంఎస్ఎంఈడీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు.

ఆర్టీసీ పీసీసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

● ఇందిరాపార్కు వద్ద యూనియన్ నేతల నిరసన

కవాడిగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఆర్టీసీలో పీసీసీ(లాజిస్టిక్స్) ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆర్టీసీ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడు మునగాల కాంతారావు డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ఆర్టీసీ యాజమాన్యం, ఎండీకి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఇందిరాపార్కు వద్ద యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సాఫ్ట్‌వేర్‌ను స్వాగతిసున్నామని, అందులో ఉన్న లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. సాఫ్ట్‌వేర్‌లోని సమస్యలను అధికారులకు చెబితే ఏజెంట్లకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. డ్యామరేజ్ చార్జీలు 100 శాతం ఏజెంట్‌కు చెందేలా చూడాలన్నారు. నిరసనలో యూనియన్ నాయకులు రాధాకృష్ణ, కృష్ణ, ప్రదీప్, మదన్ మోహన్ రావు, రఘువీర్, సూరిబాబు, జిల్లాల నేతలు పాల్గొన్నారు.

15న ఆటోల బంద్, ర్యాలీ

● షేక్ హ్యాండ్ జేఏసీ కన్వీనర్ మహ్మద్

నల్లకుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మోటారు వాహనాల చట్టం ప్రకారం వ్యతిరేకమన్నారు. ఆటోడ్రైవర్లకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 15న ఒక రోజు ఆటోబంద్ ర్యాలీ నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్స్ జేఏసీ నాయకులు షేక్ అహ్మద్ మావు, ఆజీముద్దీన్, మహ్మద్ దస్తగిరి, అహ్మద్ అన్సారీ, మహ్మద్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలో పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రముఖ గాయని మాళవికా ఆనంద్ హాజరై అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ల చైర్మన్‌లు కందూరి కృష్ణ, మాణిక్‌లాల్ ఆగర్వాల్, సభ్యులు వరాళిని, కందూరి కౌశిక్, గోవిందరావు పాల్గొన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

కనులపండువగా పాఠశాల వార్షికోత్సవం

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలోని టైమ్‌కిడ్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగాయి. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శ్రీదేవి మాట్లాడుతూ టైమ్‌కిడ్స్ ప్రీస్కూల్‌లో చిన్నారులకు ఆట, పాటలతో విద్యాబోధన చేస్తూ వారికి చదువుపట్ల ఆసక్తి పెంచడమే సంస్థ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

నీకా.. నాకా..?

● డివిజన్ అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ
● గాడ్ ఫాదర్లను నమ్ముకున్న ఆశావహులు




టి. శంకర్ ముదిరాజ్


డేవిడ్ రాజ్


కేశవపురం అరుణ్


దామోదర్‌రెడ్డి


ఎర్రం శేఖర్

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేవు. అయినా ముషీరాబాద్ నియోజక వర్గంలో రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. నియోజక వర్గంలోని కొందరు డివిజన్ అధ్యక్ష పదవి కోసం గాడ్ ఫాదర్‌ల వద్ద తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రస్తుతం ఇప్పుడు ఇదే విషయమై విస్తృతంగా చర్చ సాగుతుంది. బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడి కుర్చీ ఎవరికి దక్కుంతుందోనని చర్చించుకుంటున్నారు. డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అధ్యక్షుడి పదవి కోసం పోటీ పడుతున్నారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా పనిచేసిన మోజెస్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఎమ్మెల్యే ముఠా ముగోపాల్ అతడిని పక్కన బెట్టారు.

ఆ ఒక్కరు ఎవరో..!

కొత్త అధ్యక్షుడిని నియమించాలని డివిజన్‌లోని పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్‌పై ఒత్తిడి రావడంతో నూతన అధ్యక్షుడి నియామకం కోసం కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అధ్యక్ష పదవికోసం ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రధాన అనుచరుడు టి. శంకర్ ముదిరాజ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అనుచరుడు తెలంగాణ జాగృతి నాయకుడు డేవిడ్ రాజు, రాంనగర్ డివిజన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు. అంబేడ్కర్ నగర్ బస్తీ అధ్యక్షుడు ఎర్రం శేఖర్, ఎమ్మెల్యే తనయుడు ముఠా జైసింహ ప్రధాన అనుచరుడు కేశవపురం అరుణ్, ప్రస్తుత డివిజన్ ప్రధానకార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డిలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీంతో ఎవరికి వారు ఎమ్మెల్యే గోపాల్, యువజననాయకుడు జైసింహ మద్దతును కూడగట్టుకొని తమ ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలోనే పార్లమెంటు ఎన్నికలు, మరో ఏడాదిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో డివిజన్ అధ్యక్షుడి ఎన్నికపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు కోరుతున్నాయి. దాంతో సమర్థుడు, అందరినీ కలుపుకుని పోతూ, తమకు విధేయుడిగా ఉంటే వ్యక్తిని డివిజన్‌కు అధ్యక్షుడిగా నియమించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఇటీవల రాంనగర్ డివిజన్‌లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో టి.శంకర్ ముదిరాజ్‌కు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నేపథ్యంలో శంకర్ ముదిరాజ్‌కు డివిజన్ అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం ఉందని, మొత్తం ఐదుగురిలో ఆ ఒక్కరు ఎవరూ అని డివిజన్‌లోని బీఆర్ఎస్ నాయకులు చర్చించుకుంటున్నారు.

ఎమ్మెల్యే కవితా ద్వారా .. డేవిడ్ రాజు

ఇప్పటివరకు అధ్యక్షుడుగా కొనసాగిన ఆర్ మోజెస్ క్రిస్టియన్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. అతని పక్కన పెట్టిన నేపథ్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలని తన రాజకీయ గురువైన ఎమ్మెల్సీ కవిత ద్వారా డేవిడ్ రాజు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్సీ కవితతో ఎమ్మెల్యేకు ఫోన్ చేయించి డేవిడ్ రాజు పేరును పరిశీలించాలని చెప్పినట్టు తెలుస్తోంది. మరీ ఎమ్మెల్యే తన అనుచరుడైన శంకర్ ముదిరాజ్‌కు ఇస్తారా..? కవిత సూచించిన డేవిడ్ రాజుకు ఇస్తారా అనే అంశంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలో తీవ్రంగా చర్చ సాగుతుంది. ఇక వివాదాలకు అతీతడైన డివిజన్ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డికి అవకాశం ఇస్తారా అనేది చూడాల్సి ఉంది.

ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కవాడిగూడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని హనుమాన్ దేవాలయ ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హత, ఆసక్తి ఉన్న భక్తుల నుంచి దరాఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. దేవదాయ శాఖ సహా కమిషనర్ కార్యాలయంలో నేటి నుంచి 24 రోజుల లోపు దరఖాస్తులు అందజేయాలని ఆలయ ఈవో ఎస్. దేవనాథం తెలిపారు. అందుకు సంబంధించిన ప్రకటనను శనివారం ఆలయంలోని నోటీస్ బోర్డుపై ఉంచామన్నారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రసాద్



కవాడిగూడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కవాడిగూడ డివిజన్‌కు చెందిన కేఆర్‌కే ప్రసాద్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ ప్రకటించి, ప్రసాద్‌కు నియామక పత్రాలు అందజేశారు.

ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ జహంగీర్

ముషీరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మంద్ జహంగీర్ కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ శనివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు.

భువనగిరి కాంగ్రెస్ ఎంపీ సీటు కోసం అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య దరఖాస్తు

రాంనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భువనగిరి కాంగ్రెస్ ఎంపీ సీటు కోసం జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సల్ల సౌజన్య శనివారం గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ విద్యార్థి దశలో తాను ఎన్ఎస్‌యూఐలో కీలకంగా పనిచేశానని, మూడు సార్లు ఎన్ఎస్‌యూఐ నేషనల్ డెలిగేట్‌గా ఎన్నికయ్యాయని, రెండు పర్యాయాలు జాతీయ కార్యదర్శిగా గోవా, కర్నాటక, ఏపీ రాష్ట్రాలకు ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జిగా పనిచేసినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యమన్నారు.

సమ్మిళిత పురోగతికి ఆటంకం కలిగించేలా బడ్జెట్

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ ఆకౌంట్ బడ్జెట్‌లో సామాజిక అన్యాయానికి గురిచేసిందని దళిత బహుజనశ్రామిక యూనియన్ అధ్యక్షుడు సి.ఆనంద్, ప్రధాన కార్యదర్శి నర్సింహ పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బడ్జెట్‌పై జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అనే ప్రధాని మోదీ పిలుపును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌లో విస్మరించారని అన్నారు. సమానత్వ సాధన, పేదరిక నిర్మూలనకు ప్రత్యేకమైన నిర్దిష్ట చర్యలు బడ్జెట్‌లో ఏమీ లేవని వారు ఆరోపించారు. బడ్జెట్‌లో షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి 1,65,598 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు 1,21,023 కోట్లు కేటాయించిన ఇందులో నేరుగా దళితులకు రూ. 44.282 కోట్లు, ఆదివాసీలకు రూ.36.212 కోట్లు మాత్రమే నేరుగా ఉపయోగపడే పథకాలకు కేటాయించారని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధికి, రోడ్డు మ్యాప్‌గా పేర్కొన బడిన బడ్జెట్ దళిత, ఆదివాసీవర్గాల ప్రాథమిక అవసరాలు కల్పించడంలో విఫలమైందన్నారు. అసమానతలను శాశ్వతం చేస్తూ సామాజిక న్యాయం, సమ్మిళిత పురోగతికి ఆటంకం కలిగించే విధంగా బడ్జెట్ ఉందన్నారు. దళితులకు వెంచర్ క్యాపిటల్‌కు కేటాయించిన మొత్తాన్ని 70 కోట్ల నుంచి 10 కోట్లకు తగ్గించడమే కాకుండా ఆదివాసీలకు గత సంవత్సరం మాదిరిగానే ఈ సారి 30 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ సహాయకార్యదర్శి శివలింగం, నాయకులు పి.శంకర్, చిన్నయ్య, నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత బహుజన శ్రామిక యూనియన్ అధ్యక్షుడు సి.ఆనంద్

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత్ రిపీక

నల్లకుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 200 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన వెంచర్లకు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజలను మోసం చేస్తున్నారని నేషనల్ హ్యూమన్ రైట్స్ (ఎన్ఎస్‌హెచ్ఆర్) సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత్ రిపీక, లీగల్ సెల్ కన్వీనర్ దీప్తి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్, పి.శిల్ప ఆరోపించారు.అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని అన్నారు.

శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 260/44, 260/45, 267, 268, 261, 262, 263, 275 పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆవరణలోని భూమి మొత్తం ప్రధాన రహదారిని అనుకుని ఉందన్నారు. పృథ్వీ అవెన్యూస్, గ్రీన్ ఎర్త్ షెల్టర్, వన్య మిత్ర, తపోవన్ అవెన్యూస్, హిల్ కౌంటీ అయిదు వెంచర్ కంపెనీలు పిరమిడ్ వుడ్స్ వంటి కొన్ని ప్రైవేట్ ఏజెన్సీల ఫోల్డ్‌లకు గణనీయమైన వాల్యుయేషన్ వస్తుందన్నారు. అన్ని అనుమతులు ఉన్నట్లు తప్పుడు పత్రాలు తీసుకువచ్చి ఈ భూమిని తమ ఏజెన్సీల పేరుతో రిజిష్టర్ చేసుకుని అనతికాలంలోనే వెంచర్ కోసం నిర్మాణాలు చేశారని వారన్నారు. ఈ అక్రమ లేఅవుట్లపై డీపీవోకు ఫిర్యాదు చేస్తే ఎలాంటి అక్రమాలు జరగలేదని తప్పుడు నివేదిక అందించారని వారు ఆరోపించారు. వెంచర్ లేఅవుట్ల రద్దుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.


మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

దేశ రాజకీయాల్లో జననాయక్ ఓ మలుపు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అత్యంత వెనుకబడిన కులానికి చెందిన జన నాయక్ కర్పూరీ ఠాకూర్ బిహార్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం అప్పట్లో దేశ రాజకీయాల్లో ఒక మలుపు అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. అణచివేయబడిన వర్గాలకు ఆయన ఆశాజ్యోతిగా నిలిచారని ఆయన కొనియాడారు. శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో కర్పూరీ ఠాకూర్‌కు భారత రత్న ప్రకటించడం పట్ల నాయీ బ్రాహ్మణులు మోదీకి కృతజ్ఞతాభినందన సభ బీజేపీ స్టేట్ కన్వీనర్ సూర్యపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఆలే భాస్కర్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరై కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ.సుధాకర్, మోతే గోపాల కృష్ణ, జి.ప్రభాకర్, ఎం.సూర్యనారాయణ, దేవరకొండ నాగరాజు, ఎం.రమేశ్, టి.వికాస్ పాల్గొన్నారు.

17 బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి

● డాక్టర్ లక్ష్మణ్‌కు వినతి

నల్లకుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 బీసీ కులాలను త్వరలో సెంట్రల్ ఓబీసీ జాబితాలో చేర్చాలని 17 బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి, సాలోళ్ల సోమవంశ క్షత్రియ సంఘం రాష్ట్ర నాయకుడు బోరిద ప్రవీణ్‌కుమార్ కోరారు. శనివారం 17 బీసీ కులాల ఐక్యవేదిక కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ బీసీ 17 కులాలు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర వివక్షకు గురవుతున్నారని, సరైన గుర్తింపు లేదన్నారు. తమ పిల్లలుపోటీపరీక్షలు రాసేందుకు తీవ్రసమస్య ఎదుర్కొంటున్నారని,వీలైనంత త్వరగా సెంట్రల్‌లో చేర్చేప్రక్రియను వేగవంతంచేయాలని వారు కోరారు.

ద్విగళ గాన ప్రతిభావంతుడు సుందర్


సుందర్‌కు రికార్డు అందజేస్తున్న దృశ్యం


చిక్కడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్త్రీ పురుష గళాలను అనుకరించడం అంత సులువు కాదనీ, అలాంటి ప్రతిభ కొందరికి మాత్రమే సొంతమని అటువంటి వారిలో సుందర్ ద్విగళ గానప్రతిభావంతుడని ప్రముఖుడని కేంద్ర మాజీ మంత్రి ఎస్. వేణుగోపాలచారి అన్నారు. జానకమ్మ కళాక్షేత్రం, నాగశ్రీ సాంస్కృతికసేవా సంస్థ ఆధ్వర్యంలో కేటీ సుందర్ 108 పాటలు నిర్విరామంగా మగ ఆడ గళాలను అనుకరిస్తూ పాడి రికార్డ్ నమోదు చేసుకున్నారు. ఇంటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి బింగి నరేందర్ గౌడ్ రికార్డ్ నమోదుపత్రం వేణుగోపాలచారి ద్వారా సుందర్‌కు అందజేశారు. దీప్తి వాజ్‌పేయి, నాట్యగురువు పద్మకల్యాణ్, గాయకుడు విజయ్ మండపాక పాల్గొన్నారు.

రాంనగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

● అధికారులతో నిర్మాణదారుడి వాగ్వాదం ● స్వల్ప ఉద్రిక్తత

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లోని 1-9-19/148 ఇంటి స్థలంలో నిర్మాణదారుడు రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని అదనంగా మరో రెండు అంతస్తుల నిర్మాణం చేశారు. ఈ నిర్మాణంపై ఇంటి పక్కన వ్యక్తి కోర్టును ఆశ్రయించగా, అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను కోర్టు ఆదేశించింది. దీంతో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ఏసీపీ రమేష్‌లు ముషీరాబాద్ పోలీసుల బందోబస్తుతో శనివారం అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులకు, ఇంటి యజమానికి మధ్య వాగ్వాదం జరిగింది. ముషీరాబాద్ సీఐ వెంకటరెడ్డి అడ్డుకుంటున్న వారిని అక్కడి నుంచి పంపించి, కూల్చివేతలు నిర్వహించారు.

బాధితుడు అంజాద్ మాట్లాడుతూ ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఎలా ఇంటిని కూల్చివేస్తున్నారని అధికారులను నిలదీయగా, కోర్టు ఆదేశాల మేరకే కూల్చివేశామని తెలిపారు. ముషీరాబాద్‌లో ఎన్నో అక్రమ నిర్మాణాలు సాగుతుంటే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా పేదవాడినైన తన నిర్మాణాన్ని కూల్చివేశారని అంజాద్ ఆరోపించారు.


సంఘీభావం తెలుపుతున్న పార్టీల నాయకులు

ఇళ్ల కూల్చివేతలకు నిరసనగా దీక్షలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్‌లో ఇళ్ల కూల్చివేయడాన్ని నిరసిస్తూ బస్తీవాసులు శనివారం నిరసనదీక్షలు చేపట్టారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు శిబిరం వద్దకు బాధితులకు సంఘీభావం ప్రకటించి దీక్షలో కూర్చున్నారు. బీజేపీ నాయకుడు పూస రాజు, కాంగ్రెస్ నాయకుడు గుర్రం శంకర్, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు పి. శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజశేఖర్‌మాదిగ తదితరులు మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలి

● ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో బడ్జెట్ ప్రతుల దహనం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం ప్రధానకార్యదర్శి బి. వెంకట్ అన్నారు. శనివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగాభివృద్ధికి నిధులు, మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెబుతున్న కేంద్ర ఆర్థికమంత్రి, బడ్జెట్‌లో ఎందుకు నిధులు కేటాయించలేదో చెప్పాలన్నారు. ఈనెల 16న జరిగే గ్రామీణబంద్, సమ్మెలో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు వెంకట్‌రాములు, ప్రసాద్, పద్మ, ధర్మానాయక్ పాల్గొన్నారు.

పటాన్‌బస్తీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

● బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

ముషీరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పటాన్‌బస్తీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు శనివారం ఆయన పటాన్ బస్తీలో పర్యటించి డ్రైనేజీల నుంచి పొంగిపొర్లుతున్న మురుగు సమస్యను పరిశీలించారు. జలమండలి అధికారులకు చెప్పి పారిశుధ్య సిబ్బందితో మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తీయించివేశారు. అనంతర ఆయన మాట్లాడుతూ నిత్యం పటాన్‌బస్తీలో డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపై ప్రవహిసుందని, మురుగు సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి

● రాంనగర్ కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బస్తీలు, కాలనీల్లో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని కార్పొరేటర్ కె. రవిచారి అధికారులకు సూచించారు. శనివారం డివిజన్‌లోని ఉదయ్‌నగర్, హరినగర్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన పలు రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులను ఆయన పరిశీలించారు. ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని డీఈ గీత, ఏఈ మురళీలకు సూచించారు.

లోప్రెషర్, కలుషిత నీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలి

● కార్పొరేటర్ వై. అమృత

నల్లకుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో మంచినీటి లోప్రెషర్, కలుషిత నీటి సమస్యలపై స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వై. అమృత అన్నారు. చైతన్యనగర్‌లో మూడు నెలల నుంచి మంచినీటి సరఫరాలో లోప్రెషర్ కారణంగ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం తెల్లవారు జామున జలమండలి అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి సమస్యను పరిశీలించారు. కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి బి.సురేష్ యాదవ్, స్థానికులు వెంకటేష్, మహేష్, లక్ష్మి, అనిత, కలమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి


విద్యార్థుల నృత్య ప్రదర్శన

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని కళాశాల డైరెక్టర్ ఎస్. రిషీ కాంత్, ప్రిన్సిపాల్ భవానీ అన్నారు. డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాలలో శనివారం సాయంత్రం పీజీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన కళాశాల డైరెక్టర్ ఎస్.రిషికాంత్, ప్రిన్సిపాల్ ముదిగొండ భవానీ వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, డాక్టర్ విజయేందర్ పాల్గొన్నారు.